క్లుప్తంగా

శ్రీవారి సేవలో అనపర్తి ఎమ్మెల్యే


శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని అనపర్తి ఎమ్మెల్యే సత్తి సూర్య నారాయణరెడ్డి సోమవారం రాత్రి సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామివారి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు.

అధ్యయనోత్సవాలు ప్రారంభం


తిరుమంజనాలు జరుపుతున్న అర్చకులు, పండితులు

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్రంలో ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్సవాలు కనులపండువగా ప్రారంభమయ్యాయి. ముక్కోటి ఏకాదశి పర్వదినం మొదలుకుని పదిరోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించడం ఇక్కడ సాంప్రదాయంగా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ఉభయ దేవేరులతో శ్రీవారిని తొళక్కవాహనంపై ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి వాహనాన్ని నిత్యకల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు. మండపంలో ఏర్పాటు చేసిన రజిత సింహాసనంపై ఉత్సవ మూర్తులను ఉంచి విశేష పూజలు చేశారు. అనంతరం శ్రీవారి తిరువీధిసేవ క్షేత్రంలో వైభవంగా జరిగింది.

ప్లాస్టిక్ రహిత పంచాయతీగా కె.కోటను తీర్చిదిద్దుతాం


గ్రామ పంచాయతీ అజెండాను వివరిస్తున్న కార్యదర్శి శ్రీనివాసరావు

కామవరపుకోట : రానున్న రోజుల్లో ప్లాస్టిక్ రహిత పంచాయతీగా కామవరపుకోటను తీర్చిదిద్దుతామని సర్పంచ్ కరిపోతూ అనూష అన్నారు. సోమవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సభ సర్పంచ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి జీడి శ్రీనివాసరావు అజెండాను సభ్యులకు వివరించారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ – 2023పై ఏర్పాటు చేసిన ఫొటో గేలరీని సర్పంచ్ అనూష ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఈ.శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ మేడూరు రంగబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, పుస్తకాల పంపిణీ


పెన్నులు, పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

కుక్కునూరు : నూతన సంవత్సరం సందర్భంగా పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపు మేరకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కుక్కునూరు తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది సోమవారం పెన్నులు, నోటే పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రావు మీనా వినోద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నర్సింహారాజు, మాదిరాజు వెంకన్న బాబు, కుచర్లపాటి కృష్ణంరాజు, మల్లెల చంటినాయుడు, చేబ్రోలు ఫరీద్, అయితా కోటేశ్వరరావు, పగిల్లా అల్లేశ్, సూర్ల అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత


ఏసుకి దాతల సహాయాన్ని అందజేస్తున్న మధు, పాపారావు

కామవరపుకోట : ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడికి దాతలు సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. కామవరపుకోటకు చెందిన కంచర్ల యేసు లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో అతని కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కుంటోంది. విషయం తెలుసుకున్న పలువురు దాతలు స్పందించి రూ.35,400 అందించారు. ఈ మొత్తాన్ని సేకరించిన సోషల్ వర్కర్లు వీరమల్ల మధు, కడిపి పాపారావు ఏలూరు ఆసుపత్రికి వెళ్లి ఏసుకు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి


జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ముక్కోటి ఏకాదశి వైభవంగా నిర్వహించారు. ఆలయంలో శ్రీవెంకటేశ్వరస్వామిని శ్రీరంగనాధుడిగా అలంకరించి ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయంలో సోమవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి పూజలు ప్రారంభించారు. ధనుర్మాసం గోదారంగనాధుడు తిరుప్పావై ప్రవచనం, ఆరాధన, తీర్థప్రసాదా గోష్టి, అనంతరం భక్తులకు ఉత్తర ద్వారం నుంచి వైకుంఠ నాధుడు, ఆళ్వార్‌తో తొలి దర్శనమిచ్చారు. భక్తులు భారీగా తరలివచ్చారు. చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి స్వామిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో మానికల రాంబాబు, అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారికి పూజలు నిర్వహించుకున్న అనంతరం వారికి స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు, వేదాశీస్సులు అందించారు. పూల అలంకరణకు దాతలుగా జంగారెడ్డిగూడెంకు చెందిన శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ కట్టె జయబాబు, అన్నదాతలుగా అశ్వారావుపేటకు చెందిన ఈదల వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు వ్యవహరించినట్లు ఈవో రాంబాబు తెలిపారు. జంగారెడ్డిగూడెం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మద్దిలో శ్రీవారి దర్శనం

జంగారెడ్డిగూడెం రూరల్ : వైకుంఠ ఏకాదశి సందర్భంగా గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో ఉపాలయంలో కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లను ఉత్తర ద్వారం నుంచి భక్తులు దర్శించుకున్నారు. అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ ప్రసాదరావు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈవో ఆకుల కొండలరావు డీఎస్పీ ప్రసాదరావుకి శేషవస్త్రాన్ని కప్పి సత్కరించి ప్రసాదాన్ని అందజేశారు. 1,800 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

రంగాపురంలో సత్యదేవునికి పూజలు


వైకుంఠ ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిస్తున్న పారిజాతగిరి శ్రీవెంకటేశ్వర స్వామి


రంగాపురంలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీసత్యన్నారాయణస్వామి


బొర్రంపాలెంలో గరుడ వాహనంపై సీతారామచంద్రస్వామికి గ్రామోత్సవం

లింగపాలెం : రెండో అన్నవరంగా పిలవబడే రంగాపురం సత్యదేవుడిని సోమవారం ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రధాన అర్చకులు శేషాద్రి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఉచిత ప్రసాదాలు అందజేశారు. అలయ గుమస్తాలు ఎస్.గోపి, రాధిక కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రామాలయాల్లో సత్యదేవుని వ్రతాలు

టి.నరసాపురం : ముక్కోటి పర్వదినం గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించారు. వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేయగా, భక్తులు అధిక సంఖ్యలో స్వామి వార్లను దర్శించుకున్నారు. బొర్రంపాలెం మెట్టమీద రామాయలం వద్ద వేద పండితులు ఉమా శాస్త్రి ఆధ్వర్యంలో, శ్రీకోదండరామస్వామి ఆలయం వద్ద భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. శ్రీసీతారామచంద్రస్వామిని గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన చేశారు.

పలు చోట్ల ముక్కోటి పూజలు

కొయ్యలగూడెం : ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి సందర్భంగా దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని కన్నాపురం రామాలయంలో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. కొయ్యలగూడెంలో దేవేరులతో సహా మదన గోపాల స్వామి ముక్కోటి పూజలు అందుకున్నారు. విష్ణు సహస్రనామ పారాయణ, లలితా సహస్రనామ పారాయణలు నిర్వహించారు. రాజవరంలోని రామాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ధనుర్మాస ప్రాముఖ్యతను పండితులు పేర్కొన్నారు.

ఊరేగిన లక్ష్మీనరసింహ స్వామి

పోలవరం రూరల్ : పోలవరం గ్రామంలోని చిన రామాలయంలో సోమవారం తెల్లవారుజామున నుంచి అభిషేకాలు, లక్ష తులసి పూజ, గోపూజ, లక్ష్మీనారాయణహోమం నిర్వహించారు. బోడిగూడెం గ్రామంలోని అలివేలు మంగ సమేత పద్మావతి వెంకటేశ్వరరావు స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గూటాల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. స్వామి వారిని గరగ నృత్యాలు, గరుడ వాహనంపై గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకట రెడ్డి, లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ సింహాద్రి ఆంజనేయ ప్రసాద్, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


జంగారెడ్డిగూడెం నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం : ముక్కోటి ఏకాదశి సందర్భంగా నూకాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు మనోజ్ శర్మ పూజాధికాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, రామలక్ష్మి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీ నూకాంబిక సేవా బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


గూటాలలో లక్ష్మీ నరసింహస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం


కన్నాపురం రామాలయంలో ముక్కోటి పూజలు అందుకున్న స్వామి


మద్దిలో శ్రీవారి దర్శనం చేసుకుంటున్న భక్తులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని గ్రామాలివే

ద్వారకాతిరుమల: మండలంలోని దేవినేనివారిగూడెం, రామన్నగూడెం, హెచ్ లింగపాలెం, మెట్టగూడెం గ్రామాలకు మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ నరసింహ స్వామి సోమవారం ప్రకటనలో తెలిపారు. వెంకటకృష్ణాపురంలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి, దేవినేనివారిగూడెం లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ వరకు నూతనంగా 33 కేవీ ఫీడర్‌ను వేస్తున్నట్టు చెప్పారు.

డిగ్రీ కళాశాలలో సేవా శిబిరం

చింతలపూడి : యర్రంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం సేవా శిబిరం ఏర్పాటు చేశారు. సర్పంచ్ కొమ్ము ఆగ్నేసు, ఉప సర్పంచ్ జంగా చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సామాజిక సేవాకార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. వారం రోజుల పాటు గ్రామంలో విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత, పచ్చతోరణం, రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహిస్తారని ప్రిన్సిపాల్ డా పి శ్రీనివాసరావు తెలిపారు. ఎన్ఎస్ఎస్ విభాగం కన్వీనర్ డాక్టర్ ఏవీఆర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

పోలవరం రూరల్ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యాక్సిస్ బ్యాంకు వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎన్నికైన విద్యార్థులకు జాతీయ స్థాయి వరకు పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు స్కాలర్‌షిప్‌లతోపాటు మొదటి బహుమతిగా రూ.లక్ష నగదు, రెండవ బహుమతిగా రూ.50వేలు నగదు అందిస్తామన్నారు. డీఎస్పీ కె.లతా కుమారి, ప్రధానోపాధ్యాయుడు బీఎస్ స్వరూప్, ఎస్సై పవన్ కుమార్, యాక్సిక్ బ్యాంకు మేనేజర్ బి.ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

క్షేత్రంలో ముగిసిన నృత్యోత్సవం

ద్వారకాతిరుమల: దేవదాయ శాఖ – ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శ్రీవారి క్షేత్రంలో గత రెండు రోజులుగా జరుగుతున్న నృత్యోత్సవ కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని వేదికపై పలువురు యువతులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

బైరి నరేష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్


నిరసన తెలుపుతున్న భక్తులు, స్వాములు

జంగారెడ్డిగూడెం రూరల్, జంగారెడ్డిగూడెం : అయ్యప్పస్వామి జన్మరహస్యంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ హిందువులు సోమవారం గురువాయిగూడెం అయ్యప్ప స్వామి ఆలయం వద్ద, జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం ఆర్డీవో ఝాన్సీరాణికి వినతిపత్రాన్ని అందజేసి పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశారు. హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని, ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. గురవాయిగూడెం అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్, విశ్వహిందూ పరిషత్, బీజేపీ ధార్మిక సంస్థ, నూకాలమ్మ గుడి కమిటీ సభ్యులు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కొయ్యలగూడెం : రాజవరంలో బేతస్థ ప్రార్థన మందిరంలో వృద్ధులకు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు అందించిన రూ.10 వేల విరాళంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 40 మందికి జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి చేతులమీదుగా దుప్పట్లు అందజేశారు. సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, ఎంపీటీసీ కొండేపాటి చింతయ్య, కోన గంగరాజు, చర్చి సభ్యులు విశ్వాసులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

చింతలపూడి : టి నరసాపురం మండలం, బంధం చర్ల గ్రామానికి చెందిన ఆచంట మధుని చింతలపూడి మండలం, యండపల్లి గ్రామానికి చెందిన నల్లమోతు శంకర్ కత్తితో దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన మధును చికిత్స నిమిత్తం చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సోమవారం గుళ్ళపూడిలో మద్యం సేవిస్తుండగా వీరిద్దరి మధ్య మాటమాట పెరగడంతో దాడి జరిగినట్లు తెలిసింది. ఎస్సై హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు పరింపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం మండలం పరింపూడి సచివాలయం -2 పరిధిలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంకు కొండ తెలిపారు. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలి

టి.నరసాపురం : నవరత్నాలలో పేదలందరికి ఇళ్ల పథకంలో భాగంగా ఇంటి స్థలం మంజూరైన ప్రతి లబ్ధిదారుడు వెంటనే ఇంటి నిర్మాణం ప్రారంభించి నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని బొర్రపాలెం సర్పంచ్ కలపర్తి వెంకటేశ్వరమ్మ అన్నారు. సోమవారం గ్రామంలోని జగనన్న లేఅవుట్ కాలనీలను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ప్రభుత్వం విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుడు ఇల్లు నిర్మించుకోలేని స్థితి ఉంటే ప్రభుత్వం ఇచ్చే నగదుతో గుత్తేదారు ఇంటి నిర్మాణం చేపడుతారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస కృష్ణచ ఎంపీటీసీ కె.సుజాత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ పెద్ద కొడుకుగా జగనన్న

- ఇచ్చిన మాట ప్రకారం అర్హులకు పింఛన్ల పంపిణీ
- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు


తెల్లంవారిగూడెంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం : రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ పెద్ద కొడుకుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని అందరినీ సమానంగా చూస్తూ ప్రేమను పంచుతున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నూతనంగా మంజూరైన పింఛనుదారులకు సోమవారం పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీను అమలు చేస్తూ వస్తున్నారని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం నూతన సంవత్సరం నాడు పెంచిన పింఛను రూ. 2750 అందజేశారన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్నందున ప్రజలను మభ్యపెట్టేందుకు పగటి వేషగాళ్లు బయల్దేరుతున్నారని అన్నారు. కరోనా సమయంలో ఏ ఒక్కరూ కూడా ప్రజల వద్దకు వచ్చిన వారు లేరని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఉన్నంత కాలం పేదలకు సంక్షేమ పథకాలు నేరుగా అందుతాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించాలని కోరారు. కాగా ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీహరి మాట్లాడుతూ మండలంలో 215 కొత్త పింఛన్లు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, వైస్ ఎంపీపీ కుక్కల వరలక్ష్మి, సర్పంచ్‌లు తెల్లం వెంకటలక్ష్మి, సరియం లక్ష్మి, బన్నే బుచ్చిరాజు, కుంజా వెంకటేశ్వరరావు, ఉయికే బొజ్జి, తెల్లం రాముడు, మాల్చి వెంకన్నబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరేటి సత్యనారాయణ, అల్లూరి రత్నాజీ రావు, తహసీల్దార్ ఎస్.శారాశాంతి, ఎస్సై ఎం.జయబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చికి ప్రజల ప్రాణాలు బలి

చంద్రబాబు తన పబ్లిసిటీ పిచ్చితో అమాయకమైన ప్రజల ప్రాణాలను బలిగొంటున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. తెల్లంవారిగూడెంలో సోమవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు ఏర్పాటు చేస్తున్న మీటింగ్‌లకు జనం హాజరు కాకపోవడంతో రెక్కాడితే కానీ డొక్కాడని బక్క జీవులకు కానుకలు ఆశ చూపించి ప్రజలను రప్పించారని అన్నారు. చంద్రబాబు సభకు అధిక సంఖ్యలో జనాలను తరలించడంతో అక్కడ జరిగిన తొక్కిసలాటలో అనేక మంది ప్రాణాలు పోవడం దారుణమన్నారు. గతంలో గోదావరి పుష్కరాల సమయంలో సుమారు 25 మందిని పొట్టన పెట్టుకున్నారని, వారం క్రితం కందుకూరులోను, నూతన సంవత్సరంలో గుంటూరులో ప్రజల ప్రాణాలు పోవడం బాధకరమన్నారు. ప్రజల ప్రాణాలు పోతున్నా చంద్రబాబు లెక్కచేయకుండా సభలు పెడుతూనే ఉన్నారని అన్నారు. ఈ సంఘటనలపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరిపి చంద్రబాబుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని బాలరాజు డిమాండ్ చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ కుక్కల వరలక్ష్మి, సర్పంచ్‌లు తెల్లం రాముడు, కుంజా వెంకటేశ్వరరావు, జోడే సత్యదుర్గాప్రసాద్, బన్నే బుచ్చిరాజు, ఉయికే బొజ్జి, మాల్చి చిన్న వెంకన్నబాబు, ఎంపీటీసీలు గాలి దుర్గారావు, వెంకాయమ్మ, నాయకులు తెల్లం దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

వీరన్న సేవలు చిరస్మరణీయం


వీరన్న విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణానికి మొగళ్లపు వీరన్న అందించిన సేవలు చిరస్మరణీయం అని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. సోమవారం మొగళ్ళపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వీరన్న 114వ జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఎలీజా వీరన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1968–69లో ఆసుపత్రి నిర్మాణానికి స్థలాన్ని దానం చేసిన వీరన్న అభినందనీయులని అన్నారు. స్థలదాత వీరన్న గారి తండ్రి నర్సయ్యగారి పేరును ఆసుపత్రికి పెట్టడం జరిగిందన్నారు. వీరన్న కుమారుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తన తండ్రి వీరన్న స్థలం ఇచ్చినా ఇక్కడ 30 పడకల ఆసుపత్రిని ప్రారంభించి, అనంతరం 100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దిన ఘనత మహానీయుడు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, శిశు సంక్షేమ రీజనల్ చైర్మన్ వందనపు సాయి బాల పద్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, పట్టణ అధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ బేబీ కమల, ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ మెంబెర్ బావనరుషి, కనపర్తి రాజేష్, ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ సామ్రాజ్యం, బత్తిన చిన్న, హఫీజ్, కృష్ణారెడ్డి, మొగళ్ళపు వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను ఎమ్మెల్యే ఎలీజా సోమవారం పరిశీలించారు. సత్య సాయి సేవా ట్రస్టులో వెంకటేశ్వరావు కోరిక మేరకు రోగులకు స్వయంగా ఎమ్మెల్యే ఆహారాన్ని వడ్డించారు. అలాగే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డాంగే నగర్‌కి సంబంధించిన సచివాలయం శానిటరీ సెక్రటరీ దుర్గారాను పరామర్శించారు.

మన్యంలో కురిసిన వాన

బుట్టాయగూడెం : పశ్చిమ ఏజెన్సీప్రాంతంలో సోమవారం రాత్రి వర్షం కురిసింది. శీతాకాలమైనప్పటికీ గత రెండు రోజులుగా సాయంత్ర సమయానికి ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడుతూ వచ్చారు. అయితే సోమవారం సాయంత్రం వరకూ ఉక్కపోతగా ఉన్నప్పటికీ రాత్రి సమయానికి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని చిరుజల్లులు ప్రారంభమై వర్షం కురిసింది. వర్షం అధికంగా కురవడంతో ఉన్నట్టుండి చలి కూడా పెరిగింది.

కొణిజర్లలో పాలవెల్లువ కేంద్రం ప్రారంభం

లింగపాలెం : కొణిజర్లలో సోమవారం జగనన్న పాల వెల్లువ పాలకేంద్రాన్ని సర్పంచ్ నూజివేటి జయశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పాలవెల్లువ కేంద్రాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపసర్పంచ్ లక్కపాము శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు చొదిమళ్ల విజయభస్కరరావు, నిమ్మగడ్డ నాగరాజు, వెలుగు సీసీ బాబు రావు, కార్యదర్శి ప్రవీణ్, సీఏ ఎం.వరలక్ష్మి, పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ మొక్కలు పంపిణీ చేయాలని ధర్నా


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

చింతలపూడి : ఆయిల్‌పామ్ మొక్కలు ప్రయారిటీ ప్రకారం పంపిణీ చేయాలని కోరుతూ ఈనెల 4న గోద్రేజ్ ఫ్యాక్టరీ ముందు తలపెట్టిన ముట్టడిని జయప్రదం చేయాలని సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి ఎం వసంతరావు, పామాయిల్ రైతుల ఐక్యవేదిక కన్వీనర్ పి.సోమశేఖర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రైతులు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. ఆయిల్‌పాం కంపెనీలు రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలు పంపిణీ చేయడం లేదని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఇటీవల తహసీల్దార్ సమక్షంలో రైతులతో జాయింట్ మీటింగ్ నిర్వహించి తీర్మానం చేసినా ఇంత వరకు ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించలేదన్నారు. అనంతరం తహసీల్దార్ కృష్ణజ్యోతికి వినతిపత్రం అందచేశారు. రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే కాలేష, దొంతా కృష్ణ, సీపీఐ సహాయ కార్యదర్శి టి బాబు, జంగా రామచంద్రారెడ్డి, టి మాణిక్యాలరావు, సాంబశివరావు, పొట్టి సత్యన్నారాయణ, డి వెంకటేశ్వరరావు, తెగడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.